క్లుప్తంగా

ఎల్వోసీ అందజేత



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన నాగేంద్రం కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన నాయకులు వేణు, గోపాల్, లక్ష్మణ్‌నాయుడు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన రూ.2.50లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఎల్‌ఓసీ కాపీని సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్ సాగర్, రంజిత్‌కుమార్, మాలపల్లి సురేందర్‌గౌడ్, శివకుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

వీపనగండ్ల: రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు పంట పొలాల వద్ద విద్యుత్ వైర్లను అమరుస్తున్నారని, దీంతో పలువురు ప్రమాదానికి గురి కావడమే కాక మూగ జీవాలు సైతం మృత్యువాత పడుతున్నాయని ఎస్‌ఐ రాణి ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు విద్యుత్ వైర్లను అమర్చడంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా విద్యుత్ వైర్లు అమర్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

బుక్ కీపర్ సస్పెన్షన్

చిన్నంబావి: మండలంలోని అమ్మాయిపల్లికి చెందిన బుక్ కీపర్ గ్రామ మహిళా సమైఖ్యలో అవినీతికి పాల్పడినందున ఆమెను సస్పెండ్ చేసినట్లు మద్దిలేటి తెలిపారు. గ్రామ మహిళ సమైఖ్యలో మహిళా సంఘం సభ్యుల అనుమతి లేకుండా వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారని ఆమెపై కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు గ్రామంలో పర్యటించారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద మహిళ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. దీంతో ఆమె చేసిన అవినీతి బయటపడటంతో విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఏపీఎం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణ కేంద్రంలోని గాయత్రి కాలనీలో సోమవారం ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అసత్య ఆరోపణలతో బీఆర్‌ఎస్, బీజేపీలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం పెబ్బేరు పట్టణంలో నిర్వహించే షేక్‌అలీషా ఉర్సుకు హాజరు కావాలని చిన్నారెడ్డికి మైనార్టీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, పట్టణ అధ్యక్షులు వెంకట్రాములు, రాములుయాదవ్, మాజీ సర్పంచ్ కాటమోని రాజశేఖర్‌గౌడ్, విజయ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, దేవన్నగౌడ్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వీపనగండ్ల: పేదలకు అండగా ఉన్న సీపీఎం జిల్లా మూడో మహాసభలు వచ్చే నెల 10, 11 తేదీల్లో మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం సీనియర్ నాయకులు తూంకుంట భాస్కర్‌రెడ్డి, మండల కార్యదర్శి బాల్‌రెడ్డి తెలిపారు. మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు సోమవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి సంగినేని వీరభద్రం హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో బాలస్వామి, పెద్ద కాజా, వెంకటయ్య, మురళి, ఆశన్న, ఈశ్వర్, వెంకటేశ్వర్లగౌడ్, నర్సింహ, రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సంక్షేమ పథకాలు

వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని బీజేపీ వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో సోమవారం పెబ్బేరు మండలంలోని కొత్తూగూరులో బీజేపీ సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు దేవేందర్‌నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



వీపనగండ్ల: ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన యామినిరెడ్డి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. దీంతో సోమవారం సీపీఎం నాయకులు విద్యార్థినితో పాటు తల్లిదండ్రులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్య సిబ్బంది పనిచేయాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సిబ్బందితో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకునేలా చూడాలని, ప్రతి గర్భిణి పీహెచ్‌సీలోనే కాన్పు చేయించుకునేలా, 102 వాహనం సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. చిన్నారులకు వేసే వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలన్నారు. అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా రక్తహీనత నివారణ, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వీపనగండ్లలో మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్

అవగాహన కల్పించాలి

వీపనగండ్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య వసతులపై గ్రామీణ ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మాతా, శిశు మరణాల తగ్గింపునకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోమని మహిళలను చైతన్యపర్చడంతో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు కీలక బాధ్యతలు వహించాలన్నారు. ఆయుష్ డాక్టర్లు హేమవర్ధన్, శ్వేత, కరుణశ్రీ, భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది దయామణి, కేశవులు, కమలమ్మ, విజయకుమారి, జహంగీర్ పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటిక ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో సామూహిక హిందూ శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని బీజేపీ మండల నాయకులు తహసీల్దార్ సుగుణకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, యువమోర్చా మండల అధ్యక్షుడు గోపి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌ను కలిసిన బీజేపీ నాయకులు గ్రామంలో ఇటీవల ఒకరిద్దరు చనిపోతే ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయో వివరించారు. మండల కేంద్రం అయిప్పటికీ సామూహిక హిందూ శ్మశానవాటిక లేదని వారు తహసీల్దార్‌కు వివరించారు. ఎవరు చనిపోయినా తాతల కాలం నుంచి గుట్టల అంచున పెట్టేవారమన్నారు. ఇటీవల ఫారెస్టు అధికారులు బొందలు పెట్టరాదని అభ్యంతరం చెప్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమయంలో మృతదేహాలను పెట్టుకుని ఏడవాలో లేక ఫారెస్టు అధికారులను బతిమిలాడాలో తెలియడం వాపోయారు. ఇలాంటి సమస్యలు తలెత్తకుండ గుట్టల సమీపంలో ప్రభుత్వ భూమి ఉంటే గుర్తించి సామూహిక శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆశన్న, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాంచంద్రయ్య, శాంతయ్య, అంజనేయులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆత్మకూర్: రాష్ట్రప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్ల బోధన ఫీజులు, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అర్జున్, రాష్ట్ర నాయకుడు సాయికుమార్ అన్నారు. సోమవారం విద్యార్థులతో కలిసి ఆత్మకూర్ పురవీధుల గుండా భారీ ర్యాలీ చేపట్టి స్థానిక గాంధీచౌక్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్నా.. నేటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. బోధన ఫీజులు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులను వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. రాస్తారోకో కారణంగా భారీగా ట్రాఫిక్ జాం కావడంతో పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రాజేష్, సందీప్, అనిల్, మణి, నిజగుణ, విద్యార్థులు తదీతరులున్నారు.

పదేళ్లు దోపిడీ చేసి ఇప్పుడు నీతులా?

- బీఆర్‌ఎస్‌కు ఆరాటం ఎక్కువ.. పోరాటం తక్కువ
- డిసెంబర్‌లో రూ.రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తాం
- కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న వేముల శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూర్: పదేళ్లు అధికారం వెలగబెట్టి రైతులను, రాష్ట్ర ప్రజలను విస్మరించి అక్రమార్జనే ధ్యేయంగా ముందుకెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులు 10 నెలలకే కాంగ్రెస్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు ఆరాటం కోసమే పోరాటం చేస్తున్నారని, ప్రభుత్వాన్ని నిందించడమే లక్ష్యంగా సాగుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీలన్నీ అమలు చేస్తూ ముందుకెళ్తున్నామని, డిసెంబర్ 9 నాటికి రూ.2 లక్షల రైతు రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు.

రూ.7,600 కోట్లకు టోకరా

గత పాలకులు రైతుబంధుకు సంబంధించి రూ.7,600 కోట్లు ఇవ్వకుండా చేతులెత్తేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిందని గుర్తుచేశారు. రైతుల పంటలు నష్టపోతే ఆదుకోకుండా కనీసం పరామర్శించ లేదని, కేంద్రం నుంచి రావాల్సిన రూ.2,500 కోట్లు రైతులకు అందనీయకుండా చేసి రైతులకు ఇబ్బందులకు గురిచేశారని ధ్వజమెత్తారు. కేవలం 10 నెలల్లోనే రైతుల కోసం ప్రభుత్వం రూ.50 వేల కోట్లు ఖర్చు చేసిందని, రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్‌పై చిల్లర రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు మణివర్ధన్‌రెడ్డి, నాగేశ్వర్, గణేష్, రఫీక్, మహమ్మద్, ఖాజ, వంశీ, వెంకట్రాంరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, కొండన్న, లక్ష్మన్న, వెంకటన్న తదితరులు ఉన్నారు.

క్రషర్‌ను తొలగించాలని కాలుష్య బోర్డుకు ఫిర్యాదు



మదనాపురం: మండలంలోని దంతనూరు శివారులో ఉన్న క్రషర్‌ను వెంటనే తొలగించాలని బీజేపీ నాయకులు బిట్టి రాజశేఖర్‌యాదవ్ సోమవారం రాష్ట్ర కాలుష్య నివారణ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 61, 62 లో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకొని ఎంపీఆర్ క్రషర్ ఉండడం కారణంగా వనపర్తి, ఆత్మకూర్, కొత్తకోట, తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. క్రషర్ దుమ్ము వాహనాదారుల కళ్లలో పడి ప్రమాదాలకు గురవుతున్నారని, గతంలో ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగాయని వివరించారు. అదే విధంగా క్రషర్ పక్కనే గాయత్రీ మనీ పేరుతో రెడ్‌మిక్స్ కాంక్రీట్ ఆర్‌ఎంసీ మిషన్‌ను గోవిందహళ్లీ గ్రామ శివారులో ఏర్పాటు చేశారని, దీనివల్ల వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సత్వరమే అధికారులు స్పందించి వీటిపై చర్యలు తీసుకుని తొలగించాలని కోరారు.

రిజర్వాయర్‌లో చేప పిల్లల విడుదల



గోపల్‌దిన్నె రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదులుతున్న అధికారులు, కాంగ్రెస్ నాయకులు

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్‌లో సోమవారం మత్స్యశాఖ అధికారులు 80 వేల చేప పిల్లలను వదిలారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన చేపల రకాలు బొచ్చ, రవ్‌టు, మైనూ వంటి 8 నుంచి 10 సెంటిమీటర్ల సైజులో ఉన్న చేప పిల్లలను రిజర్వాయర్‌లో వదిలినట్లు ఫీల్డ్ ఆఫీసర్ భరత్, ఫీల్డ్ మెన్ వీరేష్ తెలిపారు. రిజర్వాయర్‌తోపాటు ఊరచెరువులో 30 వేలు, మాదిరెడ్డికుంటలో 10,500 చేపపిల్లలను వదిలామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారి సతీష్, మత్స్యశాఖ సిబ్బంది రవి, రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, నాయకులు రవీందర్‌రెడ్డి, వెంకటయ్య, సురేష్, ఇరిగేషన్ అధికారి అనంతప్రసన్న రాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి సహదేవుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రధానంగా అండర్ డ్రెయినేజీ నిర్మాణం, వీధికుక్కలు, కోతుల బెడద, దోమల నివారణ, అసంపూర్తి స్కూల్ భవనం, రోడ్డు నిర్మాణం వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకునేలా గ్రామ సభలో తీర్మానం చేయాలని వారు పేర్కొన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోకుంటే గ్రామస్తులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పార్టీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటి వెంకటయ్య, భగత్, ఎండీ ఖాజా, చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు యాదగిరిచారి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి



ఖిల్లాఘనపురం: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ సుగుణ, ఎంపీడీఓ వెంకటాచారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈదమ్మ, బాలల సంరక్షణ శాఖ అధికారి యాదమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి బాలల సంరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాల చేయడం ద్వారా బాలికలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతారన్నారు. బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, మైనర్లను పనుల్లో పెట్టుకోవడం లాంటి ఏ అంశంలోనైనా కమిటీల సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు.

బిల్లులు చెల్లించాలని వినతి



మదనాపురంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఆత్మకూర్‌లో.. తహసీల్దార్‌కు..

ఆత్మకూర్: ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ, జీపీఎఫ్, మెడికల్ బిల్లులు, సరెండర్, పెన్షన్ బిల్లులు, సప్లమెంటరీ, ఏరియల్స్, కుబేర్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని తపస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తపస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తహసీల్దార్ చాంద్ పాషకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణ, మండల బాధ్యులు వగ్గు ఉమాశంకర్, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, మల్లేష్, నారాయణ తదితరులు ఉన్నారు.

మదనాపురం: తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ధర్మాగ్రహ దీక్ష నిరసన కార్యక్రమంలో భాగంగా ఐదు డీఏలు, పీఆర్సీ, మెడికల్ బిల్లు, సప్లమెంటరీ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ అబ్రహాంలింకన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయుల కన్వీనర్ రామ్మోహన్, మహేందర్‌గౌడ్, ఈశ్వర్‌లాల్, కృష్ణ, ప్రసాద్, దేవ, సుజాత తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి నోచుకోని ఏడో వార్డు



ఈద్గా వెనకాల రహదారి దుస్థితి

అమరచింత: మున్సిపాలిటీలోని ఏడో వార్డులో ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ప్రజలు మున్సిపల్ పాలక మండలిపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఏడో వార్డులో సీసీ రోడ్లతో పాటు డ్రెయినేజీలను సైతం నిర్మించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులను విస్మరిస్తున్న మున్సిపల్ అధికారులు తమ నుంచి ఇంటి, కుళాయి పన్నులు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్‌లోని బీసీ కాలనీలోని ఏడో వార్డు నుంచి బీజేపీ అభ్యర్థి కౌన్సిలర్‌గా ఎన్నికవ్వడంతో పాలకవర్గం ఇలా కక్ష్య సాధింపు ధోరణితో ఇప్పటి వరకు ఎలాంటి నిధులు కాలనీ అభివృద్ధికి కేటాయించలేకపోయారని వార్డు కౌన్సిలర్ ఉషారాణి ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో చిత్తడి నేలతో ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉండటంతో ఈగలు, దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వార్డు ప్రజలు వాపోయారు. మున్సిపల్ పదవీకాలం కేవలం ఇంకా నాలుగు నెలలే ఉందని ఇప్పటికైనా తమ వార్డు అభివృద్ధిపై పాలక మండలి దృష్టి సారించాలని కోరుతున్నారు.

వర్షపు నీరు ఆదా చేయండి



ఆత్మకూర్: వర్షపు నీరు వృథా కాకుండా.. ఒడిసి పట్టుకొని భూగర్భ జలాలను పెంపొందించాలని పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 2 ఆధ్వర్యంలో మానవ జీవనం, భూగర్భ జలాల పాత్ర అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భూగర్భ జలాలు పెరిగితేనే మానవ మనుగడ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు షకీల్‌అహ్మద్, చక్రపాణిరెడ్డి, శ్రీనివాసులు, లత, గిరిధర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఎదుట సీపీఐ ధర్నా



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

అమరచింత: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ మున్సిపల్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు అబ్రహం, భాస్కర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 1, 2, 4, 6, 7 వార్డుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా.. ఎక్కడి సమస్యలు అక్కడనే అన్నట్టుగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త డంపింగ్ యార్డును తరలించాలని, 3, 4, 7వ వార్డుల్లో మిగిలిపోయిన సీసీ రోడ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలన్నారు. 4వ వార్డులో మహిళలకు మరుగుదొడ్లను నిర్మించాలని తహసీల్దార్ కార్యాలయం నుంచి కుమ్మరిగేరి వరకు నిరుపయోగంగా ఉన్న కాల్వ మరమ్మతులు చేసి డ్రెయినేజీ నిర్మించాలన్నారు. పట్టణంలో ప్రమాదకరంగా మారిన 11 కేవీ విద్యుత్ వైర్లను తొలగించి కొత్త లైన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాత విద్యుత్ ఇనుప స్తంభాలను తొలగించి ప్రమాదాలు నివారించాలంటూ మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రవీందర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ, సోలు, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రగతిశీల రైతుసంఘం నాయకులు

ఆత్మకూర్: అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 300 రోజులు అవుతున్నా కాలయాపన చేస్తోందని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న అన్నారు. సోమవారం స్థానిక రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, పంటల, రైతు బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధరణి సమస్యలు పరిష్కరించడంతో పాటు అర్హులకు పోడు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, ప్రసాద్, చెన్నరాయుడు, రాందాసు, మణివర్ధన్, ఆశన్న, కుర్మన్న, చింతలన్న, సామేలు, రైతులు ఉన్నారు.

పార్వతమ్మకు ఘన నివాళి



మదనాపురం: మండలంలోని అజ్జకొల్లుకు చెందిన రిపోర్టర్ పాండయ్య తల్లి పార్వతమ్మ దశదిన కార్యక్రమంలో సోమవారం మదనాపురం, కొత్తకోట మండలాలకు చెందిన నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గుంద్రాతి వామన్ గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాగాకు విశ్వేశ్వర్, బీసం చెన్నకేశవరెడ్డి, గాడిల ప్రశాంత్, కటికె శ్రీను, భీమన్న నాయుడు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రాంపురం గ్రామ శివారులోని ఊకచెట్టు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మండలం రాంపురం గ్రామానికి చెందిన డ్రైవరు అరుణ్ ఊకచెట్టు వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా బీట్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు గ్రామంలోని ఆలయం వద్ద ఆపి విచారించారు. దీంతో ఎలాంటి అనుమతి పత్రాలు చూపకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

రైతు సదస్సును విజయవంతం చేయండి

గోపాల్‌పేట: వనపర్తి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించే రైతు సదస్సును విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాల్‌రాజు, మాజీ వైస్ ఎంపీపీ శేఖర్ కోరారు. సోమవారం వారు స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చకుండా రైతులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. వారి వైఫల్యాలను ఎండగట్టేందుకు జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మన్యం నాయక్, శివ, రాజేష్‌గౌడ్, గోపాల్, కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: జిల్లాకేంద్రంలోని పాల కేంద్రం వద్ద జరిగే ప్రజా రైతు సదస్సును విజయవంతం చేయాలని వనపర్తి మండలంలోని అచ్యుతాపురంలో సింగిల్ విండో చైర్మన్ రఘువర్ధన్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ దేగ మహేశ్వర్‌రెడ్డి, శ్రీ రంగాపురం మండలంలో సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథంనాయుడు, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, ఆశన్న నాయుడు, శ్రీను, రామన్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి ,వినోద్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.